
సాక్షి ఒడిశా
మంగళవారం । 26 । నవంబర్ । 2024



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు రూ. 4,35,240, బంగారం 150 మిల్లీ గ్రాములు, వెండి 32 గ్రాములు 750 మిల్లీ గ్రాములు -భువనేశ్వర్/పూరీ



సంతోష పర్వం

కొరాపుట్ పర్వ్ ఉత్సాహంగా జరిగింది. కళాకారులు అదరగొట్టారు.

-8లో



కాశీనగర్‌లో గ్రీవెన్స్ సెల్

కాశీనగర్‌లో గ్రీవెన్స్‌సెల్‌కు జనం పోటెత్తారు. సమస్యలు చెప్పుకున్నారు.

-8లో

న్యూస్‌రీల్

దివ్యాంగులకు ట్రై సైకిళ్ల పంపిణీ



దివ్యాంగులకు ట్రైసైకిళ్లు పంపిణీ చేస్తున్న అధికారులు

రాయగడ: దివ్యాంగులకు ట్రైసైకిళ్లను అధికారులు పంపిణీ చేశారు. జిల్లాలోని మునిగుడ సమితి కార్యాలయం సమావేశం హాల్‌లో సోమవారం జరిగిన వినతుల స్వీకరణ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఫరూల్ పట్వారి ఐదుగురు దివ్యాంగులకు ట్రైసైకిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా 97 వినతులను స్వీకరించారు. ఇందులో 77 గ్రామసమస్యలు ఉండగా.. మరో 20 వ్యక్తిగత సమస్యలుగా గుర్తించారు. వీటిని పరిశీలించి పరిష్కరించాలని సంబంధిత శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో గుణుపూర్ సబ్ కలెక్టర్ కిరణ్ దీప్ కౌర్ సహోట, జిల్లా పరిషత్ ముఖ్యకార్యనిర్వాహక అధికారి నిహారి రంజన్ కుహోరో, జిల్లా ముఖ్యవైద్యాధికారి డాక్టర్ లాల్ మోహన్ రౌత్రాయ్ పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా రెండు స్వయం సహాయక బృందాలకు చెందిన మహిళలకు ఏడు లక్షల రుపాయల ఆర్థిక సహాకారాన్ని అందించారు. అలాగే వైద్య ఖర్చుల నిమిత్తం మరో నలుగురికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ. ఎనిమిది వేల చొప్పున ఆర్థిక సాయాన్ని పంపిణీ చేశారు.

ఆటోని ఢీకొన్న ఎమ్మెల్యే కారు



ఆటోని ఢీకొన్న ఎమ్మెల్యే కారు

భువనేశ్వర్: ఖుర్దా జిల్లా బొడొ పొఖోరియా ఛక్ ప్రాంతంలో సోమవారం రోడ్డు ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో ఎమ్మెల్యే కారు ఆటోని ఢీకొంది. ఈ కారు గంజాం జిల్లా ఖల్లికోట నియోజక వర్గం ఎమ్మెల్యే పూర్ణ చంద్ర సెఠికి చెందినదిగా గుర్తించారు. ఎదురుగా వెళ్తున్న ఆటోని వెనుక నుంచి ఎమ్మెల్యే కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్‌తో పాటు నలుగురు గాయపడ్డారు. బాధితులను ఖుర్దా జిల్లా ప్రధాన ఆస్పత్రిలో చేర్పించారు. ప్రమాదానికి గురైన కారులో భువనేశ్వర్ వెళ్తున్న ఎమ్మెల్యే పూర్ణ చంద్ర సెఠి క్షేమంగా ఉన్నారు. జంకియా థాణా పోలీసులు ప్రమాదానికి గురైన ఆటోని స్వాధీన పరచుకుని విచారణ ప్రారంభించారు.

వరకట్న వేధింపులతో మహిళ ఆత్మహత్య

రాయగడ: వరకట్న వేధింపులు తాళలేక ఒక వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన జిల్లాలోని అంబొదల పోలీస్‌స్టేషన్ పరిధిలో గల కుకుడాబారు గ్రామంలో చోటు చేసుకుంది. శనివారం సాయంత్రం జరిగిన ఈ ఘటనకు సంబంధించి ఎస్‌డీపీఓ సంతోషిణి ఓరం, ఐఐసీ కల్పన బెహరా ఇతర పోలీస్ సిబ్బంది సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టంకు తరలించారు. అయితే తన కూతురు ఆత్మహత్యకు పాల్పడలేదని, ఇది హత్య అని బాధితురాలి తల్లిదండ్రులు అంబొదల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు..

అంబొదల పోలీస్ స్టేషన్ పరిధిలో గల రఘుబారి పంచాయతీలోని ఖలియాగుడ గ్రామానికి చెందిన పరిక్షిత్ బిబార్ కూతురైన సోనియా బిబార్ నాలుగేళ్ల కిందట కుకుడాబారు గ్రామానికి చెందిన అకుల్ కులదీప్ కొడుకైన ఆశీష్‌తో ప్రేమవివాహం చేసుకుంది. రెండేళ్లుగా ఆమె వరకట్న వేధింపులు ఎదుర్కొంటోంది. అత్తమామలతో పాటు భర్త కూడా వరకట్నం గురించి వేధిస్తుండేవాడు. ఈ క్రమంలో గత దీపావళి నాడు సోనియా వరకట్న వేధింపులను తట్టుకోలేక తన పుట్టింటికి వెళ్లిపోయింది. గత శుక్రవారం సోనియా భర్త ఆశీష్ నచ్చజెప్పి తిరిగి తన ఇంటికి తీసుకువెళ్లాడు. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం కుకుడాబారు ఆదివాసీ వీధి చివర ఒక చెట్టుకు ఉరివేసుకుని ఆమె ఆత్మహత్యకు పాల్పడింది. అక్కడి వారు కొందరు చెట్టుకు వేలాడుతున్న మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించారు. అనంతరం బాధిత కుటుంబానికి సమాచారం అందించిన పోలీసులు వారి సమక్షంలో మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.

శీతాకాల సమావేశాలకు సిద్ధం



శాసన సభలో స్పీకర్ అధ్యక్షతన అఖిల పక్ష సమావేశం

- నేటి నుంచే సమావేశాలు

భువనేశ్వర్: శాసన సభ శీతాకాలం సమావేశాలు పురస్కరించుకుని స్పీకర్ సురమా పాఢి అఖిల పక్ష సమావేశానికి పిలుపునిచ్చారు. ఆమె అధ్యక్షతన శాసన సభలో సోమవారం ఈ సమావేశం జరిగింది. ఈ సమావేశాల్లో 25 దినాలు అధికారిక లావాదేవీలు, 5 ప్రైవేటు సభ్యుల లావాదేవీల కోసం 5 దినాలు ఉంటాయి. ఇలా శీతాకాలం సమావేశాలు సమగ్రంగా 30 రోజులు కొనసాగుతాయని శాసన సభ సచివాలయం తెలిపింది.

మంగళవారం నుంచి శీతాకాలం సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశాలు ఆద్యంతం సజావుగా కొనసాగించేందుకు అఖిల పక్షాలు సహకరించాలని స్పీకరు తెలిపారు. ఈ అభ్యర్థనపై అఖిల పక్ష సభ్యులు ఏకాభిప్రాయం వ్యక్తం చేయడంపై స్పీకర్ సంతోషం వ్యక్తం చేశారు.

డిసెంబరు నెల 31వ తేదీ వరకు ఈ సమావేశాలు కొనసాగుతాయి. ఈ సందర్భంగా నిర్వహించిన అఖిల పక్ష సమావేశానికి రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి, విపక్ష నేత్రి, చీఫ్ విప్ ప్రమీలా మల్లిక్, కాంగ్రెసు శాసన సభ నాయకుడు హాజరయ్యారు.

బీజేపీ శాసన సభ సభ్యుల సమావేశం

శాసన సభ శీతా కాలం సమావేశాలు పురస్కరించుకుని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి అధ్యక్షతన అధికార పక్షం భారతీయ జనతా పార్టీ శాసన సభ సభ్యుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మంత్రులు, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మన్మోహన్ సామల్, ఆర్గనైజింగు కార్యదర్శి మానస్ మహంతి, పార్టీ ఎమ్మెల్యేలు హాజరు అయ్యారు. ఈ సమావేశాల్లో ప్రస్తావించాల్సిన అంశాలు, ప్రతిపాదిత కార్యక్రమాలు, విపక్ష ధోరణికి ధీటైన జవాబు వగైరా అంశాలపై అధికార పక్షం వ్యూహం ప్రధాన చర్చనీయాంశంగా సమావేశం కొనసాగింది.

వాహనాల రవాణా నియంత్రణ

శాసన సభ పరిసర మార్గాల్లో వాహనాల రాకపోకల నియంత్రణకు కమిషనరేటు పోలీసు ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేసింది. శీతాకాలం సమావేశాలు ముగిసేంత వరకు ఈ మార్గదర్శకాలు నిరవధికంగా కొనసాగుతాయని స్పష్టం చేసింది. హాసింగు బోర్డు నుంచి వచ్చే వాహనాల్ని కేసరి టాకీసు కూడలి నుంచి ఎడమ వైపు మళ్లిస్తారు. ఏజీ స్క్వేర్ నుంచి పీఎమ్‌జీ కూడలి వైపు వెళ్లే వాహనాల్ని జయదేవ్ భవన్ కుడి వైపు నుంచి ఇందిరా గాంధీ పార్కు గుండా మళ్లిస్తారు. మాస్టరు క్యాంటీన్ కూడలి నుంచి పీఎమ్‌జీ వైపు వెళ్లాల్సిన వాహనాల్ని దిగువ పీఎంజీ పక్క వీధి నుంచి దారి మళ్లిస్తారు. 120 ఇన్‌ఫ్యాంట్రీ బెటాలియన్ నుంచి వచ్చే వాహనాల్ని పవరు హౌసు స్క్వేర్ నుంచి పంపిస్తారు. రాజ్‌భవన్ స్క్వేర్ నుంచి ఎమ్మెల్యే కాలనీ, రవీంద్ర మండపం వైపు వెళ్లే వాహనాల్ని దారి మళ్లించి శాస్త్రినగర్ గుండా రవాణాకు అనుమతిస్తారు. ఈ నిబంధనలు అత్యవసర సేవల వాహనాలకు వర్తించవు.

నేటి షెడ్యూలు

భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం రెండో విడత శాసన సభ సమావేశాల్లో తొలి రోజున అదనపు బడ్జెటు సభలో ప్రవేశ పెట్టనున్నారు. ఆర్థిక బాధ్యతలు నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ఈ బడ్జెటుని మంగళ వారం సభలో ప్రతిపాదిస్తారు.

శాసన సభకు గట్టి భద్రత



శీతాకాలం సమావేశాలు పురస్కరించుకుని రాష్ట్ర శాసన సభకు గట్టి భద్రత ఏర్పాటు చేశారు. శాసన సభ పరిసరాల్లో భద్రతా చర్యల పర్యవేక్షణ కోసం 8 తాత్కాలిక పోలీసు శిబిరాలు ఏర్పాటు చేశారు. 24 ప్లటూన్ల పోలీసుల్ని శాంతి భద్రతల కార్యకలాపాల కోసం నియమించారు. 8 మంది అదనపు డీసీపీలు, 2 కంపెనీల కేంద్ర సాయుధ పోలీసు దళాలు, 2 యూనిట్ల స్పెషల్ టాక్టికల్ బృందాలు, 4 ప్లాటూన్ల స్పెషల్ ఆపరేషన్స్ గ్రూపు (ఎస్‌ఓజీ), జాగిలాల స్క్వాడ్, బాంబు నిష్క్రియ బృందం భద్రతా కార్యకలాపాల్లో ముందంజలో ఉంటారు. సమావేశాల ఆద్యంతం నగరంలో పలు చోట్ల సాదా దుస్తుల్లో ఇంటెలిజెన్సు వర్గాల నిఘా ఉంటుంది. స్థానిక గాంధీ మార్గం గట్టి భద్రతా వలయం మధ్య ఉంటుంది. ఈ ప్రాంతం సీసీటీవీ పర్యవేక్షణలో కొనసాగుతుంది.

బీసీ జనాభాను లెక్కించాలి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

- వెనుకబడిన వర్గాల మోర్చా డిమాండ్

జయపురం: వెనుకబడిన జాతుల జనాభాను లెక్కించాలని రాష్ట్రీయ వెనుకబడిన జాతుల మోర్చా డిమాండ్ చేసింది. స్థానిక సరోజినీ భవనంలో మోర్చా నాలుగో సమావేశం సోమవారం జరిగింది. సమావేశంలో భవానీపట్న సంధ్య కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఛొబిలాల్ సాహు ముఖ్యఅతిథిగా సమావేశాన్ని ప్రారంభించించారు. జాతీయ మోర్చా న్యూఢిల్లీ అధ్యక్షుడు బికాశ చౌధురి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ.. వెనుకబడిన జాతుల కులాలవారీగా జనాభా లెక్కలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే ఆయా కులాల జనసంఖ్య బట్టి ఎస్సీ, ఎస్టీ గుర్తింపునిచ్చి వారిని బీసీల జాబితాలో చేర్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే శాసన సభ, పార్లమెంట్ ఎన్నికలలో ఈవీఎంలకు బదులు బ్యాలెట్ పేపర్ల ద్వారా ద్వారా ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఇలా చేస్తే దేశంలో ఉన్న 85 శాతం మూల ఆదివాసీ (ఎస్టీ, ఎస్సీ, వోబీసీ, కన్వెర్టెడ్ మైనారిటీ)లకు అధికారం దక్కేందుకు ఎటువంటి సమస్య ఉండదని అభిప్రాయం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గౌరవ అతిథులుగా కిశోర్ చంద్రపటేల్, పితబాస్ శెట్టి, వెనుకబడినవర్గాల మోర్చా ఒడిశా రాష్ట్ర అధ్యక్షులు జగదీష్ యాదవ్, భారత ముక్తి మోర్చా మహిళా జాతీయ అధ్యక్షురాలు కమలినీ యాదవ్, నిరంజన్ మల్లి, కొరాపుట్ జిల్లా యాదవ మహాసభ అధ్యక్షురాలు మదన మోహన నాయక్, రాజేంద్ర కుమార్‌గౌడ, సాధీరాం నాయక్, చంద్రకాంత సుతార్, దండపాణి మహారాణ, సుశాంత మహారాణ, సధానంద భోయి, ఆదిత్య హంస, సాధీ నాయక్, వెనుకబడినవర్గ ప్రజల మోర్చా కలహండి జిల్లా కార్యదర్శి సురేష్ నాయక్ మాట్లాడారు.



హాజరైన బీసీ కులాల ప్రతినిధులు

చెత్తకుప్పల్లో అంగన్‌వాడీ ప్యాకెట్లు!

- సామాజిక మాధ్యమాల్లో వైరల్
- అధికారుల దర్యాప్తు

రాయగడ: పిల్లలకు పౌష్టికాహారం పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెల పంపిణీ చేస్తున్న పిండి ప్యాకెట్లు చెత్తకుప్పల్లో దర్శనమిచ్చాయి. రాయగడ జిల్లాలోని కాసీపూర్ సమితి ఒడాఝుర్ పంచాయతీ కార్యాలయం వెనుక కుప్పలుగా పడిఉన్న ప్యాకెట్లు ఎందుకు కుప్పలుగా పారబోశారన్న ప్రశ్న తలెత్తుతుంది. దీనికి సంబంధించిన ఒక వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతోస్పందించిన సంబంధిత శాఖ అధికారులు ఈ మేరకు దర్యాప్తు చేపట్టారు. పంచాయతీ కార్యాలయానికి దగ్గరలో అంగన్‌వాడీ, ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. ఆయా కేంద్రాలకు వచ్చే పుట్టగొడుగుల ప్యాకెట్లను లబ్ధిదారులకు ఇవ్వకుండా నిరుపయోగంగా నిల్వ ఉంచడంతో అవి పాడవ్వడంతో వాటిని చెత్తకుప్పల్లో పారబోశారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాసీపూర్ సమితి పరిధిలోని ఐసీడీఎస్ తరపున గర్భిణులు, బాలింతలకు వీటిని పౌష్టికాహారంగా పంపిణీ చేస్తున్నారు. అయితే సంబంధిత సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఇవి నిరుపయోగమవుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదిలాఉండగా ఆరు నెలల నుంచి మూడేళ్లలోపు పిల్లలకు కూడా ఇవి పంపిణీ చేస్తుండాలి. ఇలా ప్రతీ నెలకు ఒక్కో శిశువుకు రెండు కిలోల 200 గ్రాముల చొప్పున అంగన్‌వాడీ కార్యకర్తలు వీటిని ఆయా కేంద్రాల్లో పంపణీ చేయాల్సి ఉంది.



తుప్పల్లో పడి ఉన్న ప్యాకెట్లు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం



చెట్టుని ఢీకొన్న వ్యాను



దుర్ఘటన పాలైన వాహనం నుంచి మృతుల్ని దించుతున్న స్థానికులు

భువనేశ్వర్: బొలంగీరు జిల్లాలో సోమవారం మధ్యాహ్నం ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. వేగంగా దూసుకు పోతున్న పిక్ అప్ వ్యాను అదుపు తప్పి ఎదురుగా ఉన్న చెట్టుని బలంగా ఢీకొంది. వ్యాను ముందు భాగం నుజ్జు అయింది. దీనిలో ప్రయాణిస్తున్న వ్యక్తి, డ్రైవరు ఘటనా స్థలంలో దుర్మరణం పాలయ్యారు. పట్నగొడొ నుంచి పదంపూర్ వైపు వెళ్తున్న పిక్ అప్ వ్యాను పాఢేల్ గ్రామం సమీపంలో చెట్టుని ఢీకొంది. స్థానికులు హుటాహుటిన రంగంలోకి దిగి క్షతగాత్రుల్ని రక్షించేందుకు విఫల యత్నం చేశారు. పట్నగొడొ థాణా పోలీసులకు సమాచారం అందజేశారు. ఘటనా స్థలం సందర్శించిన పోలీసులు మృత దేహాల్ని స్వాధీనపరచుకుని పంచనామా కోసం స్థానిక ఆస్పత్రికి తరలించారు. మృతుల ఆచూకీ తెలియాల్సి ఉంది.



విలేకర్ల సమావేశంలో డీజీపీ వైబీ ఖురానియా

గంజాయి సాగు అంతమొందిస్తాం: డీజీపీ

భువనేశ్వర్: రాష్ట్రంలో గంజాయి సమగ్రంగా అంతమొందిస్తామని రాష్ట్ర పోలీసు డైరెక్టరు జనరల్ వైబీ ఖురానియా విలేకర్లకు తెలిపారు. ఆరేషను క్లీన్-గ్రీన్ కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో గంజాయి సాగు, రవాణాకు సంబంధించి 54 కేసులు నమోదయ్యాయి. 5,300 గ్రాముల గంజాయి జప్తు చేశారు. గంజాయి అక్రమ లావాదేవీల్లో 80 మంది నిందితుల్ని అరెస్టు చేశారు. వీరి దగ్గర నుంచి మొత్తం రూ. 15 లక్షలు పైబడి నగదు, 20 వాహనాల్ని జప్తు చేశారు. రాష్ట్రంలో అత్యధికంగా 8 జిల్లాల్లో గంజాయి సాగు విరివిగా కొనసాగుతుంది. డ్రోన్, ఉపగ్రహం ద్వారా ఈ సాగు పట్ల నిఘా కొనసాగుతుంది.

రాష్ట్రంలో కొండ, అటవీ ప్రాంతాలు గంజాయి సాగుకు అనుకూలంగా ఉన్నట్లు గుర్తించారు. కంధమల్, బౌధ్, గజపతి, రాయగడ, మల్కన్‌గిరి తదితర జిల్లాల్లో గంజాయి సాగు యదేచ్ఛగా సాగుతుంది. ఆపరేషను క్లీన్ గ్రీన్ కార్యక్రమం కింద తొలి 24 రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా 2 వేల 375 ఎకరాల విస్తీర్ణంలో గంజాయి సాగుని అంతమొందించారు. గత ఏడాది రాష్ట్రంలో 10,500 ఎకరాల విస్తీర్ణపు స్థలంలో గంజాయి సాగు రాష్ట్ర పోలీసులు నాశనం చేశారు. ఈ ఏడాది ఈ పరిమితి అధిగమించాలనే యోచనతో పోలీసు విభాగం నడుం బిగించిందని డీజీపీ వివరించారు. గంజాయి సాగు అంతమొందించడంతో గంజాయి వ్యాపారులపై విభాగం దృష్టి సారించడం విశేషం. నామ మాత్రంగా నెల రోజుల ప్రయాసతో 54 కేసులు నమోదు చేసి 5,300 గంజాయి జప్తు చేశారు. రవాణా జరుగుతున్న సమయంలో ఈ గంజాయి జప్తు చేయడం సాధ్యమైనట్లు ప్రకటించారు. గంజాయి అక్రమ రవాణాకు వినియోగించిన ట్రక్కులు, పిక్ అప్ వ్యానులు, ఇన్నోవా కారులు ఇతరేతర 20 వాహనాల్ని జప్తు చేశారు. 80 మంది నిందితుల్ని అరెస్టు చేసి నగదు రూ. 15 లక్షలు స్వాధీనపరచుకున్నారు.

యువతరం గంజాయి ప్రభావంతో మత్తుకు బానిస కాకుండా చేసేందుకు రాష్ట్ర పోలీసు గంజాయి సాగు అంతమొందించాలని కంకణం కట్టుకున్నట్లు డీజీపీ వై. బి. ఖురానియా ప్రకటించారు. గ్రీన్ క్లీన్ మిషను కింద 2026 సంవత్సరం నాటికి రాష్ట్రంలో గంజాయి సాగు పూర్తిగా అంతమొందించేందుకు లక్ష్య నిర్ధారణ చేసినట్లు డీజీపీ తెలిపారు.



రాష్ట్రంలో గంజాయి సాగు

అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లర్ అరెస్టు



గంజాయి స్మగ్లర్ కార్తీక్ బహుదూర్ అరెస్టును వెల్లడిస్తున్న పోలీసు అధికారి రమణీ రంజన్ దొలాయి

జయపురం: అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లర్ కార్తీక్ బహుదూర్ ఉరఫ్ లామా (32)ని సోమవారం అరెస్టు చేసినట్లు పట్టణ పోలీసు అధికారి రమణీ రంజన్ దొలాయి వెల్లడించారు. కార్తీక బహుదూర్ లామా జయపురం సమితి గేట్‌గుడ వాసి అయిన భీర్ బహుదూర్ లామా కుమారుడని తెలిపారు. కార్తీక్ గంజాయి కేసుల్లోనే కాకుండా దోపిడీ, దొంగతనాలు, లూటీలు, హత్యల్లో కూడా నిందితుడని పేర్కొన్నారు. కొరాపుట్, మల్కనగిరి జిల్లాల్లోని అనేక పోలీసు స్టేషన్‌లలో అతడిపై కేసులు ఉన్నాయని తెలిపారు. ఇదివరకే అతడికి శిక్ష పడిందని, కస్టడీ నుంచి తప్పించుకున్నాడని, నాలుగేళ్లుగా ఒడిశాలో గంజాయి వ్యాపారం చేస్తున్నాడని తెలిపారు. సోమవారం పోలీసులకు అందిన సమాచారం మేరకు జయపురం సబ్‌డివిజన్ పోలీసు అధికారి ఆదేశం మేరకు సబ్‌ఇన్‌స్పెక్టర్ ఎస్.కె.బెహర, ఎస్ఐ ఎం.సాహులు గేట్‌గుడ గ్రామంలో అతడి ఇంటిపై దాడి చేసి పట్టుకున్నారు. అతడిపై నేడు 5 కేసులు, 9 వారెంట్లు ఉన్నట్లు పోలీసు అధికారి వెల్లడించారు.

11 ఎకరాల్లో గంజాయి సాగు ధ్వంసం

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా మల్కన్‌గిరి సమితి బీఎల్ పూర్, పంచాయతీ సీంద్రీమాల పంచాయతీల్లో 11 ఎకరాల్లో సాగు చేస్తున్న గంజాయి పంటను సోమవారం మల్కన్‌గిరి ఐఐసీ రీగాన్‌కీండో నేతృత్వంలో సిబ్బంది ధ్వంసం చేశారు. బిల్‌పూర్‌లోని 5 ఎకరాల్లో 7500 గంజాయి మొక్కలు, సింద్రీమాల పంచాయతీలోని ఆరు ఎకరాల్లో 9వేల గంజాయి మొక్కలను నరికి ధ్వంసం చేశారు. దీని విలువ రూ.2 కోట్లు ఉంటుందని ఐఐసీ రీగాన్‌కీండో తెలిపారు.



సింద్రీమాల పంచాయతీలో గంజాయిని ధ్వంసం చేస్తున్న పోలీసులు

18 కిలోల గంజాయి స్వాధీనం

- ఇద్దరు అరెస్టు

రాయగడ: అక్రమంగా తరలిస్తున్న 18 కిలోల గంజాయిని అబ్కారీ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనతో సంబంధం ఉన్న ఇద్దరిని అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో బీహార్ రాష్ట్రానికి చెందిన అఖిలేష్ కుమార్ భాకతీ, రాఖేష్ ఛౌరాసియాలు ఉన్నట్లు అబ్కారి శాఖ అధికారి గుప్తేశ్వర్ ప్రధాన్ సోమవారం తెలిపారు. కేసు నమోదు చేసి నిందితులను కోర్టుకు తరలించామన్నారు. ఆదివారం స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించడంతో వారి బ్యాగులను తనిఖీ చేయగా అందులో గంజాయి పట్టుబడిందన్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ. 80 వేలు ఉంటుందని అంచనా వేశారు.



గంజాయితో పట్టుబడిన నిందితులు

22 కిలోల గంజాయి పట్టివేత

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా బలిమెల పోలీసులు ఆదివారం రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఇద్దరు యువకులు బైక్‌పై గంజాయి తరలిస్తూ పట్టుబడ్డారు. కలిమెల సమితి కూర్మానూర్ పంచాయతీ రస్‌బెఢ గ్రామానికి చెందిన ప్రతాప్ ఖేముందు(25), హుభా ఖేముండు (18) అనే ఇద్దరు బైక్‌పై తెలంగాణ రాష్ట్రానికి గంజాయి తరలించేందుకు వెళ్తున్నారు. పోలీసు తనిఖీల్లో దొరికిన వీరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. దొరికిన గంజాయి విలువ రూ.1.50 లక్షలు ఉంటుంది.



పోలీసులు అరెస్టు చేసిన గంజాయి నిందితులు

కట్నం ఇవ్వలేదని సారె సామాను దగ్ధం

భువనేశ్వర్: రాష్ట్రంలో విభిన్నమైన వర కట్న, కానుకల వివాదం వెలుగు చూసింది. నయాగడ్ జిల్లా దసపల్లా థాణా బురుసాహి గ్రామస్తుడు బిజయ్ నాయక్‌తో నెక్కిగుడా గ్రామస్తురాలు మమత నాయక్‌కు 20 ఏళ్ల కిందట పెళ్లి జరిగింది. పెళ్లి మొదలుకొని నిన్న మొన్నటి వరకు వీరి వైవాహిక జీవనం ఆనందమయంగా సాగింది.

ఇటీవల కాలంలో బిజయ్ నాయక్ పెళ్లి నాటి ప్రతిపాదన ప్రకారం అపాచి బైక్, నగదు కానుకగా ఇవ్వాలని మంతనాలు ప్రారంభించాడు. అతని భార్య ఇందుకు నిరాకరించడంతో భార్యాభర్తల మధ్య బేదాభిప్రాయాలు బలం పుంజుకుని తరచు వాదులాట పెరిగింది. కొడుకు పక్షాన నిలిచిన తల్లి కోడలిని వేధించడం ఆరంభించింది. ఎదిగిన పిల్లల సమక్షంలో భర్త, అత్త వేధింపుల్ని సహించలేని పరిస్థితుల్లో ఆమె పిల్లలతో సహా ఇల్లాలు పుట్టింటికి వెళ్లిపోయింది. వారం రోజులు గడిచిన తర్వాత అత్త వారింటికి వెళ్లిన అల్లుడు అత్త, మామ, బావ మరిది సమక్షంలో తన భార్యని దుర్భాషలాడారు. అయినా ఉక్రోషం చల్లారక పోవడంతో పెళ్లి సందర్భంగా సమర్పించిన సారె సామానుని అత్త వారింటి ముందు పోగు చేసి పెట్రోలు పోసి దగ్ధం చేశాడు. ఈ సమగ్ర సంఘటన స్థానికుల్ని సంభ్రమాశ్చర్యాలకు గురి చేసింది. దీనిపై దసపల్లా థాణాలో బాధిత ఇల్లాలు పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసింది. దీని ఆధారంగా కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.



దగ్ధమైన సారె సామాను

క్లుప్తంగా

ప్రధాన మంత్రి రాష్ట్ర పర్యటన

భువనేశ్వర్: భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రాష్ట్ర పర్యటనకు విచ్చేయనున్నారు. రాష్ట్రంలో తొలి సారిగా పోలీసు డైరెక్టరు జనరల్, ఇన్‌స్పెక్టరు జనరల్ జాతీయ స్థాయి సదస్సుకు ప్రధాన మంత్రి హాజరు కానున్నారు. ఆయనతో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా పాల్గొంటారని రాష్ట్ర పోలీసు డైరెక్టరు జనరల్ వైబీ ఖురానియా తెలిపారు. ఈ సదస్సు ఈ నెల 29 నుంచి ఆరంభమై వరుసగా 3 రోజులపాటు కొనసాగుతుంది. దేశ వ్యాప్తంగా రాష్ట్రాలు, కేంద్ర పాలిత రాష్ట్రాలు, కేంద్ర పోలీసు దళాల డైరెక్టరు జనరల్, ఇన్‌స్పెక్టరు జనరల్ పాల్గొంటారు. జాతీయ స్థాయిలో పోలీసు రంగం ఎదుర్కొంటున్న పలు సవాళ్లు, కాలమాన పరిస్థితులకు అనుగుణంగా పోలీసు కార్యాచరణ సంస్కరణలు వగైరా అంశాలపై ఈ సదస్సులో పోలీసు అధికారులు చర్చిస్తారు. సదస్సు తీర్మానాలతో తాజా మార్గదర్శకాలు వెలుగు చూస్తాయని డీజీపీ వైబీ ఖురానియా వివరించారు. ఈ సదస్సు ఈ నెల 29 నుంచి డిసెంబరు నెల 1వ తేదీ వరకు కొనసాగుతుంది. ఈ సందర్భంగా విచ్చేయనున్న భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 3 రోజులపాటు రాష్ట్రంలో బస చేస్తారని రాష్ట్ర న్యాయ శాఖ మంత్రి పృథ్వీ రాజ్ హరిచందన్ తెలిపారు. ఈ నెల 29వ తేదీ సాయంత్రం చేరి డిసెంబరు నెల 1వ తేదీ మధ్యాహ్నం వరకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రాష్ట్రంలో ఉంటారని మంత్రి తెలిపారు.

ఆటోలను ఢీకొట్టిన పాలవ్యాన్

భువనేశ్వర్: ఒడిశా పాడి ఉత్పాదకుల సమాఖ్య ఓంఫెడ్ పాల వ్యాన్ రెండు ఆటోలను ఢీకొట్టింది. ఈ ఘటనలో పలువురు గాయపడగా.. ఆటో డ్రైవర్ పరిస్థితి విషమంగా ఉంది. వ్యాన్ డ్రైవర్ నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణంగా భావించిన స్థానికులు ఆగ్రహించి ఆందోళనకు దిగడంతో కాసేపు ఉద్రిక్తత నెలకొంది. దీంతో నందన కానన్, జయదేవ్ విహార్ మార్గంలో రాస్తారోకో నిర్వహించడంతో ఉభయ దిశల్లో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

మాల్యవంత్ ఉత్సవాలకు ఏర్పాట్లు



థాగూర్ సొసైటీ కార్యాలయాన్ని కూల్చివేస్తున్న దృశ్యం

మల్కన్‌గిరి: వచ్చేనెల 13 నుంచి 17వ తేదీ వరకు జరగనున్న మాల్యవాంత్ ఉత్సవాలను డీఎన్‌కే క్రీడా మైదానంలో నిర్వహించనున్నారు. ఇందుకోసం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా డీఎన్‌కే గ్రౌండ్ వద్ద నాలుగు గేట్లను అనుకొని ఉన్న ఠాగూర్ సొసైటీ కార్యాలయాన్ని, నాలుగు స్టాల్స్‌ను సోమవారం కూల్చివేశారు. ఉత్సవాల కోసం గ్రౌండ్‌ను విస్తరించాలని జిల్లా యంత్రాంగం నిర్ణయించింది. గతంలో ఈ మైదానంలో నిర్వహించిన మాల్యవంత్ ఉత్సవాల్లో పలుమార్లు అపశృతి చోటు చేసుకుంది. ఈసారి అలాంటి పరిస్థితులు తలెత్తకుండా అధికారులు ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

బీజేడీ ఎమ్మెల్యేల సమావేశం



నవీన్ పట్నాయక్ అధ్యక్షతన సమావేశమైన ఎమ్మెల్యేలు

భువనేశ్వర్: రాష్ట్ర శాసన సభ శీతాకాల సమావేశాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో విపక్ష బిజూ జనతా దళ్ శాసన సభ్యులు సోమవారం సమావేశం అయ్యారు. స్థానిక శంఖ భవన్‌లో బీజేడీ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్ అధ్యక్షతన సమావేశం జరిగింది. రాష్ట్ర స్వార్థ ప్రయోజనాలు, ప్రజల హక్కుల పరిరక్షణ పంథాలో ప్రతిపక్ష హోదాలో సభా సమావేశాల్లో పాత్ర పోషించాలని నవీన్ పట్నాయక్ బీజేడీ ఎమ్మెల్యేలకు సూచించారు.

కొండచిలువ కలకలం

కంచిలి: మండలంలోని మకరాంపురం గ్రామంలో లింగాల చెరువు వద్ద సోమవారం సాయంత్రం 12 అడుగుల పొడవు ఉన్నటువంటి కొండచిలువ కలకలం సృష్టించింది. దీంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఆ మార్గంలో వెళ్తున్న వారు కొండచిలువను హతమార్చినట్లు తెలిసింది.



బొయిపరిగుడలో పర్వ్‌లో కొరాపుట్ ఎమ్మెల్యే తదితరులు



బొరిగుమ్మ పర్వ్ వేదికపై జయపురం ఎమ్మెల్యే బాహిణీపతి తదితరులు



బొరిగుమ్మ పర్వ్ ఉత్సవంలో ఆదివాసీ డ్యాన్స్

సంతోష పర్వం



బొయిపరిగుడ పర్వ్‌లో డ్యాన్స్ చేస్తున్న కొరాపుట్ ఎమ్మెల్యే, సమితి ఉద్యోగులు



బొయిపరిగుడ ఉత్సవంలో మాట్లాడుతున్న కొరాపుట్ ఎమ్మెల్యే రఘునాథ్ మచ్చ

జయపురం: జయపురం సబ్‌డివిజన్ సమితుల్లో బొరిగుమ్మ, బొయిపరిగుడ సమితుల్లో కొరాపుట్ పర్వ్ ఆదివాసీ మహోత్సవాలు ఉల్లాసంగా జరిగాయి. బొరిగుమ్మ సమితి మినీ స్టేడియంలో ఆదివారం జరిగిన పర్వ్ ఉత్సవాలకు ముఖ్య అతిథిగా జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి హాజరయ్యారు. ఆదివాసీలతో నాట్యం చేసి అలరించారు. బొరిగుమ్మ సమితి బీడీఓ సంధ్యా సమరత్ అధ్యక్షతన జరిగిన పర్వ్ ఉత్సవాల్లో ఎమ్మెల్యే బాహిణీపతి పర్వ్ నిర్వహణ ప్రధాన లక్ష్యాలను వివరించారు. కార్యక్రమంలో కొరాపుట్ ఎంపీ ప్రతినిధి రామ చంద్ర పాఢీ, సమితి ఉపాధ్యక్షులు రమాకాంత పాఢీ, న్యాయవాద సంఘ అధ్యక్షులు నారాయణదొర తదితరులు పాల్గొన్నారు. బొయిపరిగుడలో సోమవారం జరిగిన కొరాపుట్ పర్వ్ కార్యక్రమంలో కొరాపుట్ ఎమ్మెల్యే రఘునాథ్ మచ్చ జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలు ప్రారంభించారు. ఆదివాసీ సంప్రదాయ నృత్యాలతో ప్రారభమైన పర్వ్‌లో ఎమ్మెల్యేతో పాటు సమితి అధ్యక్షుడు ప్రశాంత కుమార్ గుప్త డ్యాన్స్ చేసి ఉర్రూతలూగించారు.



డ్యాన్స్ చేస్తున్న జయపురం ఎమ్మెల్యే బాహిణీపతి

కాశీనగర్ సమితిలో గ్రీవెన్స్‌సెల్



గ్రీవెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ బిజాయ్ కుమార్ దాస్ తదితరులు



మహిళలు తయారు చేసి ప్రదర్శించి పిండి వంటలను పరిశీలిస్తున్న కలెక్టర్ బిజాయ్ కుమార్ దాస్ హజార్

మల్కన్‌గిరి: పర్లాకిమిడి గజపతి జిల్లా కాశీనగర్ సమితి గోరిబంద పంచాయతీలో సోమవారం ప్రత్యేక గ్రీవెన్స్‌సెల్‌ను అధికారులు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ బిజాయ్ కుమార్ దాస్ హజార్ పాల్గొని 53 వినతులు స్వీకరించారు. వీటిలో గ్రామస్యలపై 19, వ్యక్తిగతంపై 34 వచ్చాయని కలెక్టర్ చెప్పారు. వీటిని పరిశీలించి పరిష్కరించాలని ఆయా విభాగాల అధికారులను ఆదేశించారు. కాశీనగర్ సమితిలో గోరిబంధ, సియాలి, బూరద గ్రామ పంచాయతీల నుంచి వినతులు అందాయన్నారు. అనంతరం కలెక్టర్ కాశీనగర్ సమితిలోని పలు స్వయంసహాయక గ్రూపులను సందర్శించారు. కార్యక్రమంలో గజపతి జిల్లా ఎస్పీ జితేంద్రనాథ్ పండా, జిల్లా పరిషత్ చైర్మన్ గవర తిరుపతిరావు, సమితి అధ్యక్షురాలు బల్ల సాయమ్మ, ఐటీడీఏ పీవో అంజుమాన్ మాహపాత్రో, బీడీవో డాంబురు దొర మల్లిక్, డీఎస్ఎస్‌వో సంతోష్‌కుమార్ నాయక్ ఉన్నారు.

మత్తిలి గ్రీవెన్స్ సెల్‌కు 82 వినతులు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా మత్తిలి సమితి సలీమి పంచాయతీ కార్యాలయంలో సోమవారం జిల్లా కలెక్టర్ ఆశీష్ ఈశ్వర్ పటేల్ నేతృత్వంలో గ్రీవెన్స్‌సెల్ నిర్వహించారు. ఈ సందర్భంగా 82 వినతులు అందాయని అధికారులు తెలిపారు. జిల్లా అదనపు ఎస్పీ తాపాస్ నారాయణ్ రోతో, అదనపు కలెక్టర్ సోమనాథ్ ప్రధన్, జిల్లా సామాజిక భద్రతా అధికారి నిర్మల్ దురువా పాల్గొన్నారు.



మల్కన్‌గిరి: వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆశీష్ పటేల్

కాపు కుటుంబం జిల్లా కార్యవర్గం ఎన్నిక

- అధ్యక్షుడిగా జర్నలిస్టు కొయ్య శ్రీనివాసరావు

జయపురం: కొరాపుట్ జిల్లా కాపు కుటుంబం కార్యవర్గ ఎన్నిక సోమవారం స్థానిక యాదవ భవనంలో జరిగింది. న్యాయవాది కె.ప్రసాదరావు పర్యవేక్షణలో జరిగిన ఎన్నికల్లో జర్నలిస్టు కొయ్య శ్రీనివాసరావును అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. సాధారణ కార్యదర్శిగా పి.జగదీష్‌రావు, ఉపాధ్యక్షులుగా ఎం.ఆదినారాయణ, బి.నరేష్, సహాయ కార్యదర్శులుగా ఎం.ఈశ్వరరావు, బి.శివప్రసాద్, కోశాధ్యక్షుడిగా బి.రమేష్, కార్యవర్గ సభ్యులుగా ఎం.సర్వేశ్వరరావు, పి.తిరుపతి, ఎస్.శివ, పి.శ్రీనివాసరావు, జి.వెంకటరమణ, జి.మన్మథరావు, సి.హెచ్.ఆదినారాయణ, ఎస్.భవానీ, కె.గోపాలరావు, కోటేశ్వరరావు, వై.ప్రసాద్, డి.అప్పారావును ఎన్నుకున్నారు. న్యాయ సలహాదారుడిగా కె.ప్రసాద్ రావు, సలహాదారులుగా పి.భాస్కర రావు, ఎం.శంకరరావు, దాసరి నారాయణ రావు, కె.దుర్గారావును ఎన్నికయ్యారు. 2025 జనవరి 8వ తేదీన కాపు కుటుంబం వార్షిక బంధుమిలన్ కార్యక్రమం ఏర్పాటుచేయాలని నిర్ణయించినట్లు కార్యదర్శి జగదీశ్వరరావు వెల్లడించారు. సభ్యులకు అధ్యక్షుడు శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు.



జిల్లా కాపు కుటుంబం నూతన కార్యవర్గం

జీవిత సత్యాన్ని తెలుసుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రాణా మాతాజీ

జయపురం: ప్రతిఒక్కరూ జీవిత సత్యాన్ని తెలుసుకోవాలని కోల్‌కతాలోని శారదా మఠం నిర్వాహకులు ప్రాణా మాతాజీ అన్నారు. జయపురం సమితి పూల్‌బెడ ప్రాంతంలోని విజ్ఞాన ఇంటర్‌నేషనల్ స్కూల్‌లో సోమవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. స్వామీ వివేకానంద, మహాత్మ గాంధీ జీవితాలను, వారి సత్యనిష్ఠ, క్రమశిక్షణ, త్యాగదనం, దేశ భక్తిని వివరించారు. వారి ఆశయాలను అనుసరించడం ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ అలవడుతుందన్నారు.

కార్యక్రమంలో డాక్టర్ శాంబ మండల్, రంజిత రాణి షరాఫ్, సుశాంత కుమార్ సరాప్, డాక్టర్ ప్రదీప్ కుమార్ మిశ్ర, పాఠశాల పరిశీలన కమిటీ అధ్యక్షుడు సర్వేశ్వర ప్రధాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక వైద్యంపై అవగాహన అవసరం

రాయగడ: ఆపద కాలంలో రోగి ప్రాణాలు కాపాడాలంటే ముఖ్యంగా ప్రాథమిక వైద్యం ఎంతో అవసరమని స్థానిక అటానమస్ కళాశాల ప్రిన్సిపాల్ బాబిలత షరప్ అన్నారు. సోమవారం జిల్లా స్థాయి రెడ్ క్రాస్ వలంటీర్ల శిక్షణ శిబిరంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. రెడ్ క్రాస్‌లో వలంటీర్లుగా సేవలు అందించేవారు ప్రాథమిక వైద్యా అవస్యకతపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వారికి అవగాహన కల్పించేందుకు ఇటువంటి శిక్షణ తరగతులు ఎంతో అవసరమని అభిప్రాయపడ్డారు. మూడు రోజులపాటుగా జరగనున్న ఈ శిక్షణ తరగతుల్లో వైద్య రంగ నిపుణులు ఈ మేరకు శిక్షణ కల్పిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ రెడ్‌క్రాస్ జిల్లా కన్వీనర్ ప్రశాంత్‌కుమార్ సాహు, కోఆర్డినేటర్ ప్రశాంత్ పండా, తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ బాబిలత షరప్

ఫుట్‌బాల్ విజేతగా డొంగర

జయపురం: సహిద్ లక్ష్మణ నాయక్ 125వ వార్షికోత్సవాల సందర్భంగా జయపురం సమితి ఎకంబాలో గ్రామ సహిద్ లక్ష్మణ నాయక్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఫుట్‌బాల్ టోర్నమెంట్ నిర్వహించారు. టోర్నమెంట్‌లో ఫైనల్ మ్యాచ్ జయపురం స్పోర్ట్స్ క్లబ్, డొంగర టీమ్ మధ్య సోమవారం జరిగింది. ఉత్కంఠ భరితంగా సాగిన ఈ పోటీలో డొంగర విన్నర్‌గా నిలిచింది. ముఖ్యఅతిథి హాస్ తెరువ గ్రూప్ వ్యవస్థాపకుడు, హాస్య కళాకారుడు రామ్‌నాథ్ త్రిపాఠీ, డైరెక్టర్ గోపాలకృష్ణ సామంతరాయ్, సమాజ సేవి తాపస్ పండా, రామ్‌నాథ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత యువతలో క్రీడా స్ఫూర్తి కల్పించేందుకు ఇటువంటి పోటీలు నిర్వహణ ఎంతో అవసరమన్నారు. ఓటమికి గల కారణాలు విశ్లేషించుకుని తప్పిదాలను సవరించుకుంటే రానున్న పోటీలలో విజయం తథ్యమన్నారు. విన్నర్, రన్నర్ టీమ్‌లకు నగదు బహుమతులతోపాటు ట్రోఫీలు అందజేశారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అతిథులు

కిడ్నీరోగులకు అండగా ఉందాం

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఉద్దానం ప్రాంతంలో పెరుగుతున్న కిడ్నీ బాధితులను నిరంతరం పర్యవేక్షించి వారి రోగాన్ని కుదుటపరిచేలా చేసే బాధ్యత మనందరికీ ఉందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షుడు జూనైద్ అహ్మద్ మౌలానా అని తెలిపారు. ఉద్దానం కిడ్నీ రీసెర్చ్ సెంటర్ వైద్యులు, పారిశ్రామిక సంస్థల ప్రతినిధులతో ఆయన సోమవారం సమావేశం నిర్వహించారు. కిడ్నీ వ్యాధి నిర్మూలనకు అన్ని వర్గాలు, ప్రభుత్వ రంగ సంస్థలు కలిసి పని చేయాలని సూచించారు. ఉద్దానం కమిటీలో ఉన్న వైద్యులు, నెఫ్రాలజిస్టులు, సైకాలజిస్టులు, ఫ్యాక్టరీస్ డిపార్టుమెంట్ కలిసి ప్రత్యేకంగా కిడ్నీ వ్యాధిగ్రస్తులపై దృష్టి పెట్టాలని కోరారు.

ఎయిర్‌పోర్టు నిర్మాణానికి వ్యతిరేకంగా పర్యటన

పలాస: ప్రజల జీవనాధారమైన ఉద్దానం జీడి తోటల మధ్య ఎయిర్ పోర్టు నిర్మాణం చేయాలన్న ఆలోచనను నిలుపుదల చేయాలని వివిధ ప్రజా సంఘాల నాయకులు డిమాండు చేశారు. ఈ మేరకు పలాస నియోజకవర్గంలోని ఉద్దానం ప్రాంతంలోని గ్రామాల్లో సోమవారం పర్యటించారు. ప్రజలను కలసి ఎయిర్‌పోర్టు నిర్మాణం వల్ల తలెత్తిన సమస్యలను వివరించారు. ఎయిర్ పోర్టు నిర్మాణ వ్యతిరేక పోరాట కమిటీలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మొత్తం 20 గ్రామాల పరిధిలో గ్రీన్‌ఫీల్డ్ కార్గో ఎయిర్‌పోర్టు నిర్మాణం చేపట్టడం వల్ల రైతులకు చాలానస్టం కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అఖిల భారత రైతుకూలీ సంఘం జిల్లా నాయకులు గొరకల బాలకృష్ణ, ప్రగతి శీల మహిళా సంఘం జిల్లా నాయకురాలు పోతనపల్లి కుసుమ, కుత్తుం హేమక్క, జానకమ్మ, యువజన నాయకులు సార జగన్, రాపాక మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల హుండీలు చోరీ

సరుబుజ్జిలి: మండలంలోని పురుషోత్తపురం గ్రామ మందలమ్మ తల్లి, సంతోషిమాత ఆలయాల్లో ఆదివారం అర్ధరాత్రి దొంగలుపడ్డారు. మందలమ్మ తల్లి ఆలయంలో ఉన్న బీరువా, హుండీ , సీసీ కెమెరాలు పగులగొట్టి పట్టుకుపోయారు. హుండీలో ఉన్న కొంత నగదు, అమ్మవారికి సమర్పించిన మంగళసూత్రాలు దొంగలించుకుపోయారు. సంతోషిమాత ఆలయంలో కూడా నగదు చోరీకి గురయినట్లు నిర్వాహకులు తెలిపారు.



కోటి దీపాల వెలుగులు (ఇన్‌సెట్లో) దీపాలు వెలిగిస్తున్న మహిళలు



రెండు కన్నులా.. కోటి దీపాల వెన్నెల



జిల్లా కేంద్రంలోని పీఎస్ఎన్ఎం హైస్కూల్ వెనుక ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో సోమవారం సాయంత్రం కోటి దీపోత్సవం వైభవంగా నిర్వహించారు. పుణ్యపువీధిలోని సీతారామచంద్రమూర్తి సహిత సువర్చలా అభయాంజనేయ స్వామి ఆలయం ఆధ్వర్యంలో జరిగిన ఈ ఉత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఉత్సవంలో పాల్గొన్న వారికి 365 వత్తులతో కట్టవత్తులను, 30వేల ప్రమిదలను అందజేశారు. ఈ సందర్భంగా అర్చకులు హరిసూర్యప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో 108 శివలింగాలకు 108 మంది దంపతులతో సామూహిక మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు జరిగాయి. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జి జస్టిస్ ఫణికుమార్, ఆలయ ధర్మకర్త ముక్కాల కొండబాబు, ఎమ్మెల్యే గొండు శంకర్, దానేటి శ్రీధర్, నటుకుల మోహన్, సుంకరి కృష్ణకుమార్, యం.రామనారాయణ రావు, వేణుమాస్టార్ తదితరులు పాల్గొన్నారు. - శ్రీకాకుళం కల్చరల్

క్లుప్తంగా

14 కేజీల గంజాయి స్వాధీనం



కూనేరు చెక్ పోస్టు వద్ద పట్టుబడిన గంజాయిని స్వాధీనం చేసుకున్న రెవెన్యూ, పోలీసు సిబ్బంది

కొమరాడ: మండలంలోని అంతర్రాష్ట్ర చెక్ పోస్టు కూనేరు వద్ద పోలీసులు చేపట్టిన వాహన తనిఖీల్లో భాగంగా సోమవారం రాయగడ నుంచి పార్వతీపురం వస్తున్న బస్సులో 14 కేజీల గంజాయి పట్టబడినట్లు ఎస్సై కె.నీలకంఠం తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒడిశాలోని రాయగడ పట్టణానికి చెందిన పలమతాయి పెరుమల, తమిళనాడులోని మధురై జిల్లాకు చెందిన భూమిరాజ్‌పాండీలు బస్సులో గంజాయి తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. తహసీల్దార్ శివయ్య ఆధ్వర్యంలో గంజాయి తూకం వేసి స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక పోలీస్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం

- రూ.16 లక్షల ఆస్తినష్టం



దగ్ధమైన దుకాణం

పార్వతీపురంటౌన్: పట్టణంలోని బైక్ స్పేర్స్ దుకాణంలో సోమవారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం సంభవించింది. బైపాస్ రోడ్డు శివాలయం పక్కన ఉన్న టైర్స్ అండ్ ఆటోమొబైల్, స్పేర్‌షార్ట్స్ షాప్‌లో అగ్నిప్రమాదం విషయాన్ని తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అర్ధరాత్రి 1.30గంటల సమయంలో జరిగిన ఈ ప్రమాదంలో రూ.16 లక్షల వరకు ఆస్తినష్టం జరిగి ఉండొచ్చని అగ్నిమాపక అధికారులు అంచనా వేశారు. ఈ అగ్ని ప్రమాదంపై దర్యాప్తు చేపడుతున్నట్లు అగ్నిమాపక సిబ్బంది తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతి



మహేష్ మృతదేహం

రేగిడి: మండలంలోని పనసలవలస గ్రామంలో సోమవారం విద్యుత్ షాక్‌కు గురై ఓ వ్యక్తి మృతిచెందాడు. దీనిపై ఏఎస్సై రాజారావు అందించిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నా యి. విజయనగరం మండలం జమ్ము నారాయణపురం గ్రామానికి చెందిన యడ్ల మహేష్ (49) తన భార్య సుజాత, పిల్లలు సుధారాణి, కళ్యాణితో కలిసి ఓ ఇంటి నిర్మాణ పనులను కాంట్రాక్ట్‌కు ఒప్పుకున్నారు. ఇంటి రూఫ్‌కు వెల్డింగ్ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు కరెంట్ షాక్‌కు గురై మహేష్ కిందపడిపోయాడు. వెంటనే స్థానికులు అప్రమత్తమై రాజాం సామాజిక ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నామని ఏఎస్సై తెలిపారు.

మోటార్ స్కూటర్ ఇప్పించరూ..



ఎలక్ట్రికల్ వాహనం ఇప్పించాలని కోరుతున్న దివ్యాంగుడు చంటిబాబు

పార్వతీపురం: పట్టణంలోని జగన్నాథపురానికి చెందిన దివ్యాంగుడు కొమ్ము చంటిబాబు తన ఇద్దరి పిల్లలతో కలిసి కలెక్టర్ కార్యాలయానికి వినతిని అందించేందుకు వచ్చాడు. తనకు ప్రస్తుతం ఉన్న మూడు చక్రాల సైకిల్ మరమ్మతుల బారిన పడిందని, నడిపించేందుకు ఆరోగ్యం కూడా సహకరించడం లేదని అధికారులు స్పందించి ఎలక్ట్రికల్ స్కూటర్‌ను ఇప్పిస్తే వ్యక్తిగత పనులు చేసుకునేందుకు అనువుగా ఉంటుందని విజ్ఞప్తి చేశాడు. ఈ మేరకు సోమవారం గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందజేశాడు.

వరకట్న వేధింపుల కేసులో ముద్దాయికి జైలు, జరిమానా

విజయనగరం క్రైమ్: విజయనగరం మహిళా పీఎస్‌లో 2018లో నమోదైన వరకట్న వేధింపుల కేసులో ముద్దాయి గొండేశి నాగిరెడ్డికి ఏడాది జైలు శిక్ష, రూ.20వేల జరిమానా విధిస్తూ విజయనగరం జేఎఫ్‌సీఎం స్పెషల్ మొబైల్ కోర్టు జడ్జి పి.బుజ్జమ్మ సోమవారం తీర్పు వెల్లడించినట్లు మహిళా పీఎస్ సీఐ ఇ.నరసింహమూర్తి తెలిపారు. ఈ కేసు వివరాలిలా ఉన్నాయి. విజయనగరం పట్టణానికి చెందిన వెంకట లక్ష్మికి విశాఖ జిల్లా పెదగంట్యాడ సిద్దేశ్వరం గ్రామానికి చెందిన గొండేశి నాగిరెడ్డితో 2013లో వివాహం జరిగింది. కొంతకాలం వారి జీవితం సక్రమంగా ఉన్న తర్వాత భర్త నాగిరెడ్డి అదనపు కట్నం తెమ్మని, తరచూ మద్యం తాగి శారీరకంగా మానసికంగా వేధిస్తున్నాడని వెంకటలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదుపై మహిళా పీఎస్ పోలీసులు కేసు నమోదుచేశారు. అప్పటి ఎస్సై వెంకటరావు దర్యాప్తు పూర్తిచేసి నిందితుడిపై కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. ప్రస్తుత సీఐ నరసింహమూర్తి ఆధ్వర్యంలో కోర్టు మహిళా కానిస్టేబుల్ పూర్ణ, ఏపీపీ శాంతి గౌతమిలు సకాలంలో సాక్షులను ప్రవేశపెట్టడంతో కోర్టు విచారణ చేపట్టగా నాగిరెడ్డిపై నేరారోపణలు రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు ఇచ్చారు.

వినతుల పరిష్కారానికి చర్యలు

- అధికారులకు కలెక్టర్ ఆదేశాలు



వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్



సీతంపేట: వినతులు స్వీకరిస్తున్న ఏపీవో చిన్నబాబు



పీజీఆర్ఎస్‌కు అరకొరగా హాజరైన అధికారులు

పార్వతీపురం: ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో వచ్చిన వినతులను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం కలెక్టర్ కార్యాలయంలోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం కలెక్టర్ నేతృత్వంలో జరిగింది. ఈ సందర్భంగా వివిధ గ్రామాలనుంచి వచ్చిన 104 వినతులను కలెక్టర్‌తోపాటు డ్వామా పీడీ కె.రామచంద్రరావు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీదారుల సమస్యను సావధానంగా విని, సమస్యను బట్టి 48 గంటల్లోగా పరిష్కారం చూపాలని ఆదేశించారు. సమస్య పరిష్కారానికి ముందు క్షేత్రస్థాయిలో పరిశీలన జరపాలని, పరిష్కరించ గలిగిన సమస్యకు తక్షణమే స్పందించి పరిష్కరించాలని సూచించారు. సమస్యల పరిష్కారంతో అర్జీదారులు సంతృప్తి చెందాలని, ఆ దిశగా చర్యలు చేపట్టాలని జిల్లా అధికారులకు కలెక్టర్ స్పష్టం చేశారు. పరిష్కారం కాని సమస్యలకు, అందుకు గల సరైన కారణాలను అర్జీదారులకు వివరించాలన్నారు. సమస్యల పరిష్కారం వేగవంతం చేసే పరిణామంలో, మళ్లీ ఫిర్యాదులు పునఃప్రారంభమయ్యే అవకాశానికి తావివ్వరాదని కలెక్టర్ తేల్చిచెప్పారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అధికారుల హాజరు అంతంత మాత్రమే..

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే పీజీఆర్ఎస్ కార్యక్రమానికి జిల్లా అధికారుల హాజరు అంతంతమాత్రంగానే ఉంది. పీజీఆర్ఎస్ కార్యక్రమానికి అధికారులు విధిగా హాజరు కావాలని ఆదేశాలు జారీచేస్తున్నప్పటికీ పట్టించుకోవడంలేదు. ఈ కారణంగా పీజీఆర్ఎస్ కార్యక్రమంలో సగం కుర్చీలు కూడా నిండని పరిస్థితి నెలకొంది. సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని కలెక్టర్ పరిశీలించిన పిమ్మట జిల్లాలో రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి పాల్గొనే కార్యక్రమంలో పాల్గొనేందుకు కలెక్టర్ వెళ్లారు. కార్యక్రమంలో డ్వామా పీడీ రామచంద్రరావు వినతులను స్వీకరించారు. కలెక్టర్ పీజీఆర్ఎస్‌లో లేకపోవడంతో పలువురు అర్జీదారులు వినతులు ఇచ్చేందుకు కూడా ఆసక్తి చూపలేదు.

పబ్లిక్ గ్రీవెన్స్‌కు 58 వినతులు

సీతంపేట: ఐటీడీఏలోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 58 వినతులు వచ్చాయి. ఏపీవో జి.చిన్నబాబు వినతులు స్వీకరించారు. భామిని మండలం దిమ్మిడిజోలకు చెందిన కాగితాపల్లి రామ్మూర్తి విద్యుత్ సౌకర్యం కల్పించాలని వినతి ఇచ్చారు. కిరాణాషాప్ పెట్టుకోవడానికి రుణం మంజూరు చేయాలని చిన్నబగ్గకాలనీకి చెందిన ఈశ్వరరావు కోరారు. బుర్జమానుగూడ గ్రామస్తులు అడ్డంగి రెవెన్యూ పరిధిలో గల కొండపోడు భూములకు డీకేటీ పట్టాలు ఇప్పించాలని వినతిపత్రం అందజేశారు. అనారోగ్యం పాలైనందున ఆర్థిక సాయం చేయాలని మెట్టుపేటకు చెందిన తోట షణ్ముఖరావు కోరారు. కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ డీడీ అన్నదొర, ఏటీడబ్ల్యూవో మంగవేణి, ఏఎంవో కోటిబాబు, సీడీపీవో రంగలక్ష్మి, ఏపీడీ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి

ఎస్పీ పీజీఆర్ఎస్‌కు 8 వినతులు

పార్వతీపురంటౌన్: ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 8 వినతులు అందినట్లు ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి అన్నారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించారు. అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకుని, వారి ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించారు. పూర్వాపరాలను విచారణ చేసి, ఫిర్యాదు అంశాలు వాస్తవాలైనట్లయితే చట్టపరిధిలో తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయానికి రాలేనటువంటి ప్రజలు జిల్లాలోని పోలీస్‌స్టేషన్‌లో, సర్కిల్ కార్యాలయాలు, సబ్ డివిజన్ కార్యాలయాలలో ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. సదరు ఫిర్యాదులను ప్రజా సమస్యల పరిష్కార వేదిక' ఫిర్యాదులుగానే పరిగణించి సకాలంలో సత్వర న్యాయం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌బీ సీఐ రంగనాథ, సిబ్బంది పాల్గొన్నారు.

వినతుల పరిష్కారంలో చిత్తశుద్ధి చూపాలి

- కలెక్టర్ డాక్టర్ బీఆర్అంబేడ్కర్



సమస్యలను వింటున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్అంబేడ్కర్



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం అర్బన్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి ప్రతి సోమవారం జిల్లా అధికారులు తప్పకుండా హాజరు కావాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదేశించారు. రెండు జిల్లాల ఇన్‌చార్జ్‌లుగా వ్యవహరిస్తున్న అధికారులు ఒక వారం విజయనగరం, మరో వారం పార్వతీపురం జిల్లాకు హాజరుకావాలని సూచించారు. కలెక్టర్ అనుమతి లేనిదే పీజీఆర్ఎస్‌కు గైర్హాజరు కాకూడదని హెచ్చరించారు. సోమవారం ఎటువంటి ఇతర సమావేశాలు, కార్యక్రమాలుకానీ నిర్వహించవద్దని వినతుల స్వీకరణకు మాత్రమే హాజరు కావాలని స్పష్టం చేశారు. అనుమతి లేకుండా గైర్హాజరైన అధికారులకు మెమోలు జారీ చేయాలని డీఆర్‌ఓకు సూచించారు. ప్రజా వినతుల పరిష్కారం కోసం అందిన దరఖాస్తులను చిత్తశుద్ధితో పరిష్కరించాలని ప్రతి రోజూ లాగిన్ అయి చూడాలని ఇంకా చూడనివి సైట్‌లో ఉండకూడదని, అలాగే రీ ఓపెన్ కేసులు కూడా ఉండకూడదన్నారు. వచ్చే సోమవారం నాటికి ఏ శాఖ వద్ద వినతులు పెండింగ్ ఉన్నా చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

140 వినతుల స్వీకరణ

సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు 140 వినతులు అందజేశారు. కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జేసీ సేతుమాధవన్, డీఆర్‌ఓ శ్రీనివాసమూర్తి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

ఎస్పీకి 35 ఫిర్యాదులు

విజయనగరం క్రైమ్: ప్రజల సమస్యల తక్షణ పరిష్కారానికి 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' ఎంతగానో ఉపయోగపడుతుందని ఎస్పీ వకుల్ జిందాల్ పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి 35 ఫిర్యాదులను ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను శ్రద్ధగా విని, సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి, ఫిర్యాదుదారుల సమస్యల పరిష్కారానికి చట్టపరిధిలో చర్యలు చేపట్టి, న్యాయం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఎస్బీ సీఐ ఎ.లీలారావు, ఆర్‌వీఆర్‌కే.చౌదరి, డీసీఆర్‌బీ ఎస్సై రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రేరణ ఉత్సవ్ విద్యార్థులకు కలెక్టర్ అభినందనలు



విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం: ప్రేరణ ఉత్సవ్‌లో పాల్గొన్న కేజీబీవీ విద్యార్థిని దొడ్డి తేజస్విని, సీతానగరం మండలం బూర్జ జెడ్పీహెచ్ఎస్ విద్యార్థి బెవర హర్షవర్ధన్లను కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ సోమవారం తన చాంబర్‌లో అభినందించారు. వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా ప్రేరణ ఉత్సవ్ కార్యక్రమం గుజరాత్ రాష్ట్రం వద్‌నగర్‌లో ఈనెల 10 నుంచి 16 వరకు నిర్వహించారు. ఆంధ్ర ప్రదేశ్ కల్చర్ అండ్ హెరిటేజ్ తరఫున జిల్లా విద్యార్థులను పంపినట్లు కేజీబీవీ ఉపాధ్యాయురాలు పి.సరోజిని దేవి కలెక్టర్‌కు ఈ సందర్భంగా వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ నుంచి పార్వతీపురం జిల్లా విద్యార్థులు ఎంపిక కావడం అభినందనీయమన్నారు.

పవన కల్యాణ్ వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్వీఎస్ కుమార్

పార్వతీపురంటౌన్: వలంటీర్లపై డిప్యూటీ సీఎం పవన కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌వీఎస్ కుమార్ డిమాండ్ చేశారు. వలంటీర్ వ్యవస్థే లేదని వారు చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని కోరుతూ సోమవారం వలంటీర్ల యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఉగాది రోజున శుభవార్త చెబుతాం అని చెప్పిన మాటను మరిచి ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా వీరాంజనేయులు వలంటీర్ వ్యవస్థే లేదని అసెంబ్లీలో చెప్పడమంటే మీలో మీరే పొంతన లేని ప్రకటనలు చేసి వలంటీర్ల మనోభావాలతో ఆడుకుంటున్నారా? అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వలంటీర్లకు ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని, అధికారంలోకి వచ్చిన తరువాత వారికి నెలకు రూ.10,000 వేతనం ఇస్తామని చెప్పారని గుర్తు చేశారు. వారిని విధుల్లోకి తీసుకుని ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న బకాయి జీతాలు చెల్లించాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సింహాద్రి దుర్గారావు, వార్డు, గ్రామ సచివాలయాల వలంటీర్ల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జి. అశోక్, జిల్లా నాయకులు పి.కుమార్, బి.రామకృష్ణ, ఎం.శ్రావణి, బి. క్రాంతికుమార్, బి.రామ్మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ కెమెరాలతో మరింత భద్రత



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ ఒ.దిలీప్‌కిరణ్

పార్వతీపురంటౌన్: డ్రోన్ కెమెరాలతో మరింత భద్రత పెంచవచ్చని అదనపు ఎస్పీ ఒ.దిలీప్ కిరణ్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఏఎస్పీ అంకిత సూరానా ఆధ్వర్యంలో డ్రోన్ కెమెరా శిక్షణను పోలీస్ సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా శిక్షణలో ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే ప్రాంతాలపైన, అక్రమ రవాణా అరికట్టేందుకు, చట్టవ్యతిరేక కార్యకలాపాలు జరగకుండా ఉండేందుకు ఈ వ్యవస్థను తీసుకువచ్చామని చెప్పారు. ప్రధానంగా గంజాయి రవాణా చేసే వారిపై డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా పెట్టడానికి ఉపయోగించనున్నామన్నారు. జిల్లాలో ఉన్న అన్ని పోలీస్‌స్టేషన్‌లలో గల కొంతమంది సిబ్బందికి జిల్లా కార్యాలయంలో ఈ డ్రోన్ కెమెరా, పరికారాలు, దాన్ని ఉపయోగించే విధానాన్ని ప్రాక్టికల్‌గా వివరించారు. ఈ టెక్నాలజీని ఉపయోగించి ఏవిధంగా చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నివారించవచ్చని వివరించారు.

వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు రిఫరీగా వెంకటేష్



రిఫరీగా ఎంపికైన వెంకటేష్

బొండపల్లి: గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఈనెల 30 నుంచి వచ్చే నెల3 వతేదీ వరకు జరగనున్న సౌత్ వెస్ట్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు బొండపల్లి మండలంలోని అంబటివలస గ్రామానికి చెందిన వెయిట్ లిఫ్టర్ పాలూరి వెంకటేష్ రిఫరీగా నియమితులయ్యారు. ఈ మేరకు నాగార్జున యూనివర్సిటీ ఫిజికల్ డిపార్ట్‌మెంట్ అధికారులు ఉత్తర్వులు ఇచ్చినట్లు రిఫరీ వెంకటేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రిఫరీగా ఎంపిక కావడం పట్ల గ్రామస్తులతో పాటు జిల్లాలోని పలువురు వెయిట్ లిఫర్లు వెంకటేష్‌ను అభినందించారు.

క్రీడలతో మానసిక ఆరోగ్యం



జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభిస్తున్న విజయలలిత

విజయనగరం ఫోర్ట్: ఉద్యోగంలో బిజీగా ఉన్న వారికి మానసిక ఆరోగ్యం కల్పించేందుకు క్రీడలు దోహదపడతాయని ఏపీఈపీడీసీఎల్ డైరెక్టర్ విజయలలిత అన్నారు. ఈ మేరకు సోమవారం స్థానిక రాజీవ్ గాంధీ క్రీడా మైదానంలో రాష్ట్రస్థాయి విద్యుత్ ఉద్యోగుల క్రీడాపోటీలను ఆమె ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి విద్యుత్ ఉద్యోగులు ఈ పోటీలకు హాజరయ్యారు. అథ్లెటిక్స్, టేబుల్ టెన్నిస్ విభాగాల్లో పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గెలుపోటములతో సంబంధం లేకుండా క్రీడాస్ఫూర్తితో క్రీడాకారులు ఆడాలని పిలుపునిచ్చారు. క్రీడల నగరం విజయనగరంలో క్రీడాపోటీలు జరగడం ఆనందంగా ఉందన్నారు. ఏపీఈపీడీసీఎల్ ఆపరేషన్ సర్కిల్ డైరెక్టర్ రామచంద్ర ప్రసాద్ మాట్లాడుతూ ఉద్యోగంతోపాటు ఆరోగ్యం కాపాడుకోవాల్సిన అవసరం మనకు ఉందన్నారు. క్రీడలు ఆడడం ద్వారా పట్టుదల, క్రమశిక్షణ ,పోటీతత్వం ఏర్పడతాయని చెప్పారు. పోటీల్లో బాగా ఆడి జాతీయస్థాయి పోటీలకు ఎంపికకావాలని ఆకాంక్షించారు. ఓటమి గురించి ఆలోచించకుండా అందరు విజేతలుగా భావించి క్రీడల్లో పాల్గొనాలన్నారు.

మార్పు కోసం.. సహకరించాలి

- ఎస్పీ వకుల్ జిందాల్ విజ్ఞప్తి
- చెడుమార్గంలో పయనించవద్దని యువతకు పిలుపు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైమ్: సమాజంలో ఆశించిన మార్పు సాధించాలంటే ప్రజలందరూ పోలీసుశాఖకు సహకరించాలని ఎస్పీ వకుల్ జిందాల్ కోరారు. జిల్లాలోని యువతను సన్మార్గంలో నడిపించేందుకు, వారిని చెడు వ్యసనాలు, మాదక ద్రవాల నుంచి దూరం చేసేందుకు జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో 'మేము సైతం' అంటూ పూల్‌బాగ్‌లోని రవీంద్ర స్కూల్ ఎదురుగా ఉన్న పార్కులో సోమవారం సాయంత్రం నిర్వహించిన 'మార్పు కోసం..మేము సైతం..' కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్పీ వకుల్ జిందాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత, విద్యార్థులు చెడు వ్యసనాలు, మాదక ద్రవ్యాలకు అలవాటు పడి, వారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. తాను జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టినప్పుడే ఈ విషయం తన దృష్టికి తీసుకు వచ్చారన్నారు. యువతలో చైతన్యం తీసుకువచ్చి, వారిలో మార్పు తీసుకువచ్చేందుకు సంకల్పం పేరుతో కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన యువతను గుర్తించి, వారిలో మార్పు తీసుకువచ్చేందుకు, అవసరమైన కౌన్సెలింగ్, వైద్యసహాయం అంచేందుకు చర్యలు చేపట్టామని గుర్తు చేశారు. అంతేకాకుండా మాదక ద్రవ్యాలకు అలవాటుపడిన యువతను సన్మార్గంలో నడిపించేందుకు ముందుగా హెచ్చరించామని, మార్పు రాని వ్యక్తులపై కేసులు నమోదుచేశామని చెప్పారు. గంజాయి, మాదక ద్రవ్యాలను సమూలంగా నిర్మూలించేందుకు సంకల్ప దీక్ష చేపట్టామని పేర్కొన్నారు.



ఎస్పీని సత్కరిస్తున్న పూల్‌బాగ్ కాలనీ పెద్దలు, స్థానికులు

గంజాయి నిందితులే కీలకం

గంజాయి అక్రమ రవాణా, వినియోగం, విక్రయాలు చేపడుతున్న వారిని అరెస్టు చేసి, అందుకు కారకులైన ప్రధాన సూత్రధారులను కూడా కేసుల్లో నిందితులుగా చేర్చుతున్నామన్నారు. మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలు యువతకు అర్థమైతే, ఎన్నటికీ వాటి జోలికి పోరన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. రాత్రి 11 గంటల తర్వాత సహేతుకరమైన కారణం లేకుండా బహిరంగ ప్రదేశాల్లో తిరిగితే చట్టపరమైన చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. పూల్‌బాగ్ కాలనీలో గంజాయి విక్రయించిన 25 మందిపైన, గంజాయి వినియోగిస్తున్న 18మంది పైన కేసులు నమోదుచేశామని తెలిపారు. గంజాయి వినియోగిస్తూ పట్టుబడిన మరో 60 మంది భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని, కౌన్సెలింగ్ నిర్వహించి, వారిపై నిఘా పెట్టామని చెప్పారు. గంజాయి విక్రయాలు, రవాణాకు పాల్పడుతున్న మరో 12 మందిపై సస్పెక్ట్ షీట్లను ప్రారంభించి, వారిపై కూడా నిఘా ఉంచామన్నారు.

ఎస్పీకి సత్కారం : స్థానిక ప్రజలు కార్యక్రమంలో మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా టూటౌన్ పోలీసులు ప్రజల ఫిర్యాదులపై తక్షణమే స్పందిస్తున్నారని, సమస్యలను పరిష్కరించడంలో చొరవ చూపుతున్నారని, గంజాయి అడ్డాగా ఉన్న పార్కులలో మహిళలు స్వేచ్ఛగా తిరిగే విధంగా మార్చారని, అందుకు పోలీసుశాఖకు, ఎస్పీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీని స్థానిక ప్రజలు, మహిళలు, కార్పొరేటర్లు, పూలమాలలు, పుష్పగుచ్ఛాలు, జ్ఞాపికలు అందజేసి, సత్కరించారు. విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు, టూటౌన్ సీఐ టి.శ్రీనివాసరావు, కార్పొరేటర్లు బొండెం ఆనంద్, మారోజు శ్రీనివాసరావు, వజ్రపు శ్రీనివాసరావు, కండేటి సన్యాసిరాజు, టూటౌన్ పోలీసులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీఆర్‌టీలుగా మార్చండి

- అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల డిమాండ్
- కలెక్టరేట్ వద్ద ఆందోళన



ధర్నాను ఉద్దేశించి మాట్లాడుతున్న యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమేష్

పార్వతీపురం: గిరిజన గురుకులాల్లో అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న తమను సీఆర్‌టీలుగా మార్పుచేసేంతవరకు ఆందోళన కొనసాగిస్తామని ఏఐఎస్ఎఫ్, పీడీఎస్ఓ, గిరిజన సంక్షేమసంఘం నాయకులు స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు కలెక్టరేట్ ఆవరణలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు సీపీఎం, సీపీఐ సంఘీభావం తెలిపాయి. ఈ సందర్భంగా సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు రెడ్డివేణు, కె.మన్మథరావులు మాట్లాడుతూ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను అన్ని విధాలా ఆదుకుంటామని ఎన్నికల్లో హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత ఆదుకోవడం మాట అటుంచి ఉన్న ఉద్యోగాలు తొలగించే పరిస్థితి నెలకొందని మండిపడ్డారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను సీఆర్టీలుగా గుర్తించి సమాన పనికి సమానవేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

డీఎస్సీ నుంచి మినహాయించాలి

యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు తోట రమేష్, గిరిజన సంక్షేమసంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్‌లు మాట్లాడుతూ జోనల్ పోస్టులను డీఎస్సీలో ఎలా కలిపారని ప్రశ్నించారు. డీఎస్సీ నుంచి గిరిజన గురుకుల బోధనా పోస్టులు మినహాయించాలని డిమాండ్ చేశారు. 2022 పీఆర్‌సీ ప్రకారం జీతాలు చెల్లించాలని కోరారు. ఉద్యోగులకు భద్రతను కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం ధర్నా వద్దకు వచ్చిన డ్వామా పీడీ రామచంద్రరావుకు వినతిపత్రాన్ని అందజేశారు. కలెక్టర్‌తో సమస్యను చర్చించి అవసరమైన చర్యలను చేపట్టడం జరుగుతుందని డ్వామా పీడీ ఈ సందర్భంగా వారికి తెలిపారు. తొలుత పార్వతీపురం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా విచ్చేశారు. కార్యక్రమంలో శ్రామిక మహిళా సంఘం జిల్లా నాయకురాలు వి.ఇందిర, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బి.రవికుమార్, పీడీఎస్ఓ జిల్లా కార్యదర్శి సోమేష్, గిరిజన విద్యార్థి సంఘం నాయకుడు పి.సురేష్‌తోపాటు పలువురు పాల్గొఉన్నారు.

మహిళలు మరింత చైతన్యవంతులు కావాలి

పార్వతీపురం: మహిళలను మరింత చైతన్య పరిచేందుకే అవగాహన ర్యాలీలను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ పేర్కొన్నారు. అంతర్జాతీయ స్త్రీ హింస నిరోధక దినోత్సవం సందర్భంగా సోమవారం జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించిన ర్యాలీని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలపై లైంగిక వేధింపులు, గృహహింస, బాలికలపై దాడులు, బాల్య వివాహాలు తదితర అకృత్యాలను అరికట్టేందుకు మహిళలు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మహిళలపై జరుగుతున్న అకృత్యాలపై అవగాహన ర్యాలీలను, అవగాహన సదస్సులను ఈ నెల 25 నుంచి డిసెంబర్ 23 వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు.

మహిళలకు రక్షణ కల్పించేందుకు గృహహింస, పోక్సో, బాల్య వివాహాల నిషేధిత చట్టాలు రూపొందాయని పేర్కొన్నారు. పని ప్రదేశంలో మహిళలపట్ల లైంగిక వేధింపులు, అనైతికంగా బాలికలను రవాణా చేయడం తదితర అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. సమస్య ఎదురైనప్పుడు ధైర్యంగా ఎదుర్కోవాలని మహిళలకు పిలుపునిచ్చారు.